క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా శనివారం పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ శుక్రవారం తెలిపారు. అయితే గత నెల లాగే బ్యాంకు ఖాతాలున్న లబ్ధిదారులకు అందులోనే జమ చేస్తామన్నారు. మిగిలిన వృద్ధులు, వికలాంగులు, నడవలేక మంచంపై ఉన్న లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని వివరించారు.

'నాడు-నేడు' పనులపై సమీక్ష

ఓడీచెరువు: మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో అలెస్కో ఆనందబాబు శుక్రవారం నాడు-నేడు పనులపై సీఆర్ఎంటీ, ఎంఆర్సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించాలని సూచించారు.

ఎంపీడీఓ సేవలు మరువలేనివి



ఎంపీడీఓ పూల నరసింహులు దంపతులను సత్కరించిన దృశ్యం

తనకల్లు: ఎంపీడీఓ పూల నరసింహులు సేవలు మరవలేనివని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఎస్ఎంఎన్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పదవి విరమణ చేసిన ఎంపీడీఓ పూల నరసింహులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు ఎంపీడీఓ సేవలను కొనియాడారు. అనంతరం ఎంపీడీఓ పూల నరసింహులు దంపతులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ రిటైర్డ్ అయిన షరీఫ్‌కు పూలమాలలు, దుశ్శాలువాతో సన్మానించారు. ఈఓఆర్డీ ఆనంద యోయ, సీనియర్ అసిస్టెంట్ హాజీవలి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయం ఉద్యోగులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కమ్మగారి పరుష

అమడగూరు: మండలంలోని రెడ్డివారిపల్లి సమీపంలో గ్రామస్తులు అక్కమ్మగారి పరుషను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని గుట్టలో వెలసిన ఏడుగురు అక్కమ్మగార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఏడుగురు బాలికలు తడిబట్టలతో వచ్చి విగ్రహాల ఎదుట నిలబడగానే భూతప్పల పద్యాలు, డప్పు వాయిద్యాలకు స్వయంగా అక్కమ్మగారే బాలికల్లోకి ప్రవేశించినంతగా వారంతా పరవశించిపోయారు. బాలికలు పెద్దెత్తున ఊగుతున్న సమయంలో మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేశారు. గుడి ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఏటా ఇలా అక్కమ్మగార్లకు పూజలు చేయటంతో గ్రామమంతా సుభిక్షంగా ఉంటుందనే నమ్మకంతోనే పరుషను నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

నిబంధనలు పాటిద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్పీకుంట: ఎన్నికల కౌటింగ్ దృష్ట్యా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులను సూచించారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉందని, ఇందులో భాగంగా మండలవ్యాప్తంగా పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉంటాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించకుండా పోలీసులకు సహకరిద్దామని కోరారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రాఘవయ్య, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ఏఎస్ఐకు ఘన సన్మానం

చెన్నేకొత్తపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న ఇబ్రహీం ఖలీల్ బాషా శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం ఖలీల్ బాషాను ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శివాంజనేయులు, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు శాలువాలతో సన్మానించారు.

నేడు హనుమాన్ జయంతి

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి, గుమ్మళ్లకుంట, విశ్వనాథపురం, మాల్యవంతం, ఎం.చెర్లోపల్లి, ముష్టూరు, సంగాల తదితర గ్రామాల్లోని ఆలయాలలో శనివారం హనుమాన్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాలకు పలు ప్రాంతాల్లో ఉన్న వాయుపుత్రుని ఆలయాలన్నీ చూడముచ్చటగా ముస్తాబు చేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ స్వామికి విశేష పూజలు జరగనున్నాయి. అన్నసమారాధనలు, గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పోట్లమర్రి ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణతో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కొమందూరు మారుతి ప్రసాద్, సాయికృష్ణ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొనాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- కొత్తచెరువులో పోలీసుల మాక్‌డ్రిల్



కొత్తచెరువులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

కొత్తచెరువు: శాంతిభద్రతల పరిరక్షణ తమ లక్ష్యమని అనంతరం డీఎస్పీ వాసుదేవన్ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏవైనా అల్లర్లు జరిగితే ఎలా అణచివేస్తారో తెలియజేస్తూ పోలీసులు శుక్రవారం మండల కేంద్రంలో మాక్ డ్రిల్ చేపట్టారు. డీఎస్పీ వాసుదేవన్ ఆధ్వర్యంలో పెనుగొండ సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 100 మంది పోలీసులు, స్పెషల్ పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు వైఎస్సార్ సర్కిల్ వద్ద పోలీస్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ముందుగా ఆందోళనకారులు సర్కిల్‌లో బైఠాయించి రాళ్లు రువ్వారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని వారిని పోలీసులు మైకు ద్వారా హెచ్చరించారు. అయినా వారు వెళ్లకపోవడంతో ముందుకు దూకుతూ వారిని అక్కడి నుంచి చెదరగొట్టేశారు.

గుంపులుగా ఉండొద్దు..

అనంతరం డీఎస్పీ వాసుదేవన్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అన్నిచోట్లా 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండకూడదన్నారు. అలాగే విజయోత్సవ ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చట్టరీత్యా నేరమన్నారు. కౌంటింగ్ రోజున గుంపులుగా చేరి సమస్యలు సృష్టించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరసనలు చేపట్టే ఆందోళనకారులను మొదటగా మైకు ద్వారా హెచ్చరిస్తామని అప్పటికీ గుంపులు చెదరకపోతే భాష్పవాయువు గోళాలు ప్రయోగిస్తామన్నారు. అప్పటికీ వెళ్లకపోతే లాఠీచార్జ్ చేస్తామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా చివరగా కాల్పులు జరుపుతామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తచెరువు యుపీఎస్ సీఐ రాజరమేష్, పుట్టపర్తి టౌన్, రూరల్ సీఐలు కొండారెడ్డి, రామయ్య, పెనుగొండ సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాయం జరిగితే పోలీసులను ఆశ్రయించండి



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీలు ఎవరి చేతిలోనైనా అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో పెత్తందార్లు వెట్టి చాకిరీ, దౌర్జన్యాలు చేస్తున్నా, బాలకార్మికులను వేధిస్తున్నా తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు ఎస్సీలు, ఎస్టీలను అడ్డంపెట్టుకుని ఎస్సీ యాక్టును దుర్వినియోగం చేస్తుంటారని, అలాంటి వారి మోసాలకు గురవ్వద్దంటూ సూచించారు. గ్రామాలలోని ప్రజలందరూ ఒక్కటేనని, ఐక్యంగా జీవించాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ నాగస్వామి కాలనీవాసులకు సూచించారు. శుక్రవారం కునుకుంట్ల ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



రాజకీయ పార్టీల నాయకులకు సూచనలిస్తున్న ఎస్ఐ నరేంద్ర

ధర్మవరం రూరల్: మండలంలో 144 సెక్షన్ అమలులో వున్న నేపథ్యంలో గెలిచిన పార్టీల వారు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని అఖిల పక్ష నాయకులకు రూరల్ ఎస్ఐ నరేంద్ర సూచించారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ముదిగుబ్బ: మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు విజయోత్సవ సభలు, ర్యాలీలను జరుపుకోకూడదని సీఐ యతీంద్ర సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు తర్వాత బాణసంచా పేల్చుటకు అనుమతి లేదన్నారు. అంతేకాకుండా టపాసులు అక్రమంగా నిల్వ ఉంచి రహస్యంగా విక్రయించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలి



పోట్లమర్రిలో విత్తనకాయలను పంపిణీ చేస్తున్న ఏఓ ఓబిరెడ్డి

బత్తలపల్లి: మండలంలో ఖరీఫ్ సాగుకు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఓబిరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం బత్తలపల్లి-1, 2, పోట్లమర్రి రైతు భరోసా కేంద్రాల్లో విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులకు సకాలంలో సమస్య లేకుండా పంపిణీ చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. శుక్రవారం 278 మంది రైతులకు 246 క్వింటాళ్ల వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు వివరించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు ముత్యాలప్ప, సోముశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి/ కనగానపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తన వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేస్తోంది. నాలుగు రోజులుగా మండల వ్యాప్తంగా ఉన్న ఆర్బీకేల్లో విత్తన కాయల పంపిణీ సజావుగా సాగుతోందని ఏడీఏలు కృష్ణయ్య, విద్యావతి, చెన్నేకొత్తపల్లి ఏఓ ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని ఆర్బీకేల ద్వారా రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేరుశనగ అందజేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం 443 మంది రైతులకు 380 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశామనా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏఓలు,వీహెచ్ఎలు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించండి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన మురళి

బత్తలపల్లి: ఆర్డీటీ సహకారంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సంస్థ ఎడ్యుకేషన్ సెక్టార్ డైరెక్టర్ మోహన మురళి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో రీజియన్ పరిధిలోని సంస్థ నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజనల్ పరిధిలో 758 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 102 మందిని కుటుంబ ఆర్థిక సర్వే కోసం ఎంపిక చేశామని, సర్వే తర్వాత 62 మంది విద్యార్థులకు ఇంటర్ చదివించేందుకు సంస్థ ఎంపిక చేసిందన్నారు. వీరు విజయవాడ, అనంతపురం, తిరుపతి, కర్నూలులోని కార్పొరేట్ కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు అయ్యే మొత్తం ఖర్చును సంస్థ భరిస్తుందన్నారు. రీజనల్ డైరెక్టర్ ప్రమీల మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని పిల్లలకు ఉన్నత విద్యను అందించే కార్యక్రమాన్ని 20 ఏళ్ల క్రితం పాదర్‌ఫెర్రర్ ప్రారంభించారని గుర్తు చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఆరేళ్ల(ఇంటర్, బీటెక్) ఆర్డీటీ ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఏటీఎల్ రుక్మాంగదతో పాటు రీజనల్ పరిధిలోని ఏటీఎల్‌లు, ఆర్డీటి సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం



ఓడీచెరువులో పొగాకు వ్యతిరేక పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఎన్ఎస్‌గేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఓడీచెరువు: పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని ఓడీచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో పొగాకు వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ క్యాన్సర్ కారకాల్లో పొగ తాగడం అతి ముఖ్యమైనదన్నారు. పొగాకు ఉత్పత్తుల అలవాట్లతో ప్రజల ఆయుః ప్రమాణ సగటు రేటు అతి వేగంగా తగ్గిపోతుందని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వాడాకాన్ని పూర్తిగా మాన్పించాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ కమల్ రోహిత్, సిబ్బంది సుభాషిణి, దిల్షాద్, విజయకుమారి, వరలక్ష్మి, సరిత, నాగవేణి, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వైద్యుడు డాక్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక వైద్యశాల నుంచి ఎస్ఎస్ గేట్‌లోని నాలుగు రోడ్ల కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్ మాట్లాడుతూ.. పొగాకు వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పొగాకు వాడకం వలన ప్రతి ఏడాది అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. బీడీ, సిగరెట్లకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. పొగాకు వాడటం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలపై నిషేధం



రాజకీయ పార్టీల నాయకులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రామగిరి(చెన్నేకొత్తపల్లి): ఈ నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలకానున్నాయి. గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించొద్దని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రామగిరిలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుదన్నారు. ప్రజలు గుంపులుగా చేరి శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దన్నారు. మండల వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు చేసేందుకు అనుమతి లేదన్నారు. విజయం సాధించిన పార్టీల వారు బాణాసంచా కాల్చరాదన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా గొడవలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణ లేదా పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున కేంద్ర సాయుధ బలగాలను మొహరించడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక గ్రామల్లో డ్రోన్ కెమెరా ద్వారా వీడియోలను చిత్రీకరిస్తామని తెలిపారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజినేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్‌లోని పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 38 మంది గర్భిణులకు డాక్టర్ ఉదయ్ వివిధ వైద్య పరీక్షలు చేశారు. పలువురికి రక్త పరీక్షలు కూడా చేశారు. అనంతరం గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. సిబ్బంది భాస్కర్‌రెడ్డి, పీహెచ్ఎన్ పద్మావతితో పాటు పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జైన్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

కదిరి అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని జైన్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు మండల విద్యాధికారి చెన్నక్రిష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రూ.లక్షలు ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాలలో నోట్‌బుక్‌లు, యూనిఫాంలకు రూ. 20 వేలకు పైబడి వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు తమకు రావాల్సిన వాటా తమకు వస్తే చాలని మిన్నకుండిపోతున్నారని ఆరోపించారు. పాఠశాల నిర్వాహకులు ఉపాధ్యాయులకు సైతం జీతాలు సరిగా ఇవ్వక గతంలో 30 మంది ఉపాధ్యాయులు వెళ్లిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వాసుదేవ్, అఖిల్, నరేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆర్డీటీ ఆసుపత్రి వద్ద పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బత్తలపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కిశోర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, అనంతపురం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ బత్తలపల్లి సహకారంతో ఆర్డీటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద నుంచి ఆర్డీటీ ఆసుపత్రి మీదుగా ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆడిటోరియంలో పర్యావరణ అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వినాశనంతో రాబోయే రోజుల్లో మానవుని మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఫ్యాక్టరీలు వదిలే విషపువాయువుల వల్ల ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. దీనివల్ల విపరీతమైన వేడి పెరిగి మానవులకు వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫ్యాక్టరీలు, భవనాలు కట్టాలన్నా, రోడ్లు వేయాలన్నా చెట్ల మీదనే వేటు పడుతోందని, నరికిన చెట్ల స్థానంలో మరొక మొక్క నాటాలనే ఆలోచన లేకుండా ప్రజలు ఉన్నారన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడడం తగ్గించి బట్ట బ్యాగులను వాడడం అలవర్చుకోవాలన్నారు. కళాకారులు తమ పాటల ద్వారా అవగాహన కల్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్డీటీ వైద్యులు డాక్టర్ రఘు ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ మనోరంజన్, అర్చన, హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ కిషోర్, స్కూల్ పిల్లలు, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు ఘన సన్మానం



రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న ఏడీ వేలాయుధం



సత్కారం అందుకుంటున్న అన్వర్ హుస్సేన్ దంపతులు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ అనేది సహజమేనని డీఆర్ఓ కొండయ్య పేర్కొన్నారు. కోఆర్డినేషన్ సెక్షన్-2లో పని చేస్తున్న అన్వర్ హుస్సేన్, సీఎస్‌డీటీలు పోతన్న, నాగరాజు ఉద్యోగ విరమణ చేయడంతో కలెక్టరేటలోని స్పందన సమావేశ మందిరంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగులు తన పదవీ కాలంలో పేదలకు ఎంతో సేవ చేయవచ్చన్నారు. ఆ సేవా గుణమే మనల్ని ముందుకు నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ రామాంజనేయరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు మధునాయక్, ఎన్నికల డీటీ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్‌కు ఘన వీడ్కోలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా ఐఅండ్ పీఆర్ కార్యాలయంలో ఏవీఎస్(ఆడియో విజువల్ సూపర్‌వైజర్)గా పని చేస్తున్న రాజేంద్ర ప్రసాద్‌కు తో ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ చేయడంతో స్థానిక ఐఅండ్‌పీఆర్ కార్యాలయంలో రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఆయన భార్యను సత్కరించారు. ఈసందర్భంగా ఏడీ వేలాయుధం రాజేంద్రప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ రామాంజనేయులు, ఎస్ఏ రవిప్రకాష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రామన్న, టైపిస్ట్ ఆంజనేయులు, రికార్డు అసిస్టెంటు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



డీఏఓ రమేష్‌బాబును సన్మానిస్తున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి



ఎస్ఐ వెంకటేష్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే మంచి గుర్తింపు వస్తుందని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం రాత్రి డీఏఓ రమేష్‌బాబు ఉద్యోగ విరమణ సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ డీఏఓ రమేష్‌బాబు సేవలను కొనియాడారు. అనంతరం రమేష్‌బాబును పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ ఎస్సైకి ఆత్మీయ వీడ్కోలు

పుట్టపర్తి టౌన్: పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకటేష్‌కు సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ఆయన్నుశాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి వెంకటేష్ సేవలను కొనియాడారు. సోషయల్ మీడియా, సైబర్ క్రైమ్ సీఐ హేమంత్‌కుమార్, ఎస్పీ ఎస్ఐ ప్రదీప్ కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ డిపోలో డ్రైవర్, అసిస్టెంట్ మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.బి ఫక్రొద్దీన్, చెన్నే నాయక్ ఉద్యోగ విరమణ చేయడంతో శుక్రవారం వారిని ఉద్యోగ, కార్మిక సిబ్బంది ఘనంగా సత్కరించారు.

జీనులకుంటలో పోలీసుల కార్డెన్ సెర్చ్



జీనులకుంట గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణవేణి

గాండ్లపెంట: జీనులకుంట గ్రామంలో ఎస్ఐ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. పోలీస్‌యాక్ట్ 30, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎవరూ ఎలాంటి గొడవలకు, వివాదాలకు పోకూడదని హెచ్చరించారు. హెచ్‌సీలు రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎన్పీకుంట: ఎన్నికల కౌటింగ్ వేళ ఎవరైన శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీధర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌటింగ్ దృష్ట్యా మండల వ్యాప్తంగా పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్నాయన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని సూచించారు. గెలిచిన పార్టీకి సంబంధించిన వ్యక్తులు విజయోత్సవర్యాలీలు నిర్వహించరాదన్నారు. బాణాసంచా పేల్చడానికి, విక్రయించడానికి అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 3, 4, 5వ తేదీల్లో మద్యం విక్రయాలు ఉండవని, హోటళ్లలో అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.